# సింగిల్ పేజీ కథలు

## అపరాజిత

అప్లికేషన్ పరిశీలిస్తున్న అశోక్ కళ్లు అల్చిప్పలయ్యాయి. కారణం, రీజన్ ఫర్ లోన్ వద్ద రాసిన విషయం చూసి, ఎదురుగా కూర్చుని ఉన్న యువతిని చూశాడు. ఇరవై నాలుగేళ్ల వయస్సుండవచ్చు. చూడముచ్చటగా ఉంది. మేధస్సుతో మెరుస్తున్న కళ్లు చిన్నగా నవ్వాయి అశోక్ మొహంలోని భావాన్నర్థం చేసుకొన్నట్లుగా.

''డూ యూ హేవ్ ఎనీ అబ్జక్షన్ టు శాంక్షన్ మై లోన్?'' సన్నటి గొంతుతో, స్పష్టంగా అడుగుతున్నా ఆమెకేం సమాధానం చెప్పాలో తెలియలేదు అశోక్‌కి.

''ఇది నా పరిధిలో కష్టమైన విషయమండీ'' అన్నాడు తేరుకొని.

''ఓకే! దెన్ మీ బాస్ ఎవరో చెప్పండి. నేను మాట్లాడతాను'' అన్న ఆమె ధైర్యానికి అచ్చెరువొందుతూ, ఇదెలాగూ జరిగే పని కాదు, అయినా ఆవిడను ఎందుకు డిజప్పాయింట్ చేయాలి అనుకుంటూ 'వినియోగదారుడే మన నిజమైన స్నేహితుడు' అన్న గాంధీజీ సూక్తి అక్షరాల ఒంట బట్టించుకున్న అశోక్, ఆమెతో కలిసి బ్రాంచ్ మేనేజర్ వద్దకు వెళ్లాడు.

''నమస్తే సార్! నా పేరు అపరాజిత. నేను సెంట్రల్ ఎక్సైజ్‌లో వర్క్ చేస్తున్నాను. నేను పర్సనల్ లోన్ కోసం మీ బ్యాంకుకి అప్లై చేశాను'' అంటూ పరిచయం చేసుకొంది. తనకు లోన్ ఎందుకు అవసరమో సున్నితంగా, సుతారంగా, విడమరచి చెబుతున్న ఆమెను తేరిపార చూశాడు బ్రాంచ్ మేనేజర్.

'తన కూతురే ఇలాంటి స్థితిలో ఉంటే, ఇదే కారణం చూపుతూ లోన్‌కోసం అప్లై చేస్తే' అని మనసులో తనకు తానే ప్రశ్నించుకున్న మేనేజర్ పైకి మాత్రం ''ఈ కారణంపై నేనీ లోన్ శాంక్షన్ చేయకపోతే?'' అన్నాడు.

''చేస్తారు సర్, ఎందుకంటే, నా అవసరం అలాంటిది. ఇందులో అబద్ధం లేదు. అన్యాయం లేదు..ఏదో అబద్ధపు కారణం చెబుతూ, నేను మిమ్మల్ని, మీ బ్యాంకుని మోసగించడం లేదు. నా అవసరాన్ని యథాతథంగా మీ ముందుంచాను. మీరు తప్పనిసరిగా ఈ లోన్ శాంక్షన్ చేస్తారు. నా శాలరీ మీ బ్యాంకుకే ఎటాచ్ అయి ఉంది. కాబట్టి, మీకు రీపేమెంట్ ప్రాబ్లమ్ లేదు'' అన్న ఆమె వాదనతో ఏకీభవిస్తూ... సంతోషంగా లోన్ శాంక్షన్ చేశాడు బ్రాంచ్ మేనేజర్.

శాంక్షన్ అయిన ఎమౌంట్ చూసిన అశోక్ ఆశ్చర్యపోయాడు. కారణం సామాన్యంగా అంత ఎమౌంట్ శాంక్షన్ చేయడం జరగదు. మేనేజర్ తనకున్నంత పరిధిలో పూర్తిగా న్యాయం చేశాడు.




''థాంక్యూ సర్!'' అంటూ బైటకు నడుస్తున్న ఆమెను, మేనేజర్ ఛాంబర్ బైట ''మేడమ్ ఒక్క నిముషం'' అంటూ ఆపాడు అశోక్.

''కంగ్రాచ్యులేషన్స్. నా పద్దెనిమిదేళ్ల సర్వీస్‌లో ఈ కారణంతో లోన్ ఎవ్వరూ తీసుకోలేదు. మీ ధైర్యానికి రియల్లీ హేట్సాఫ్! ఐ విష్ యూ ఎ బ్రైట్ ఫ్యూచర్'' అన్న అతనికి థాంక్స్ చెప్పి ఠీవిగా తన స్కూటీ వైపు నడుస్తున్న ఆమెను చూసి 'అపరాజిత' అంటే పరాజయం లేనిది అనుకుంటూ తన సీట్‌వైపు నడిచాడు అశోక్.

రెండు నెలల తర్వాత...

ఒక చల్లని సాయంత్రం...

భార్యాభర్తలిద్దరూ భవిష్యత్తు గూర్చి చర్చించుకుంటున్న తరుణంలో...

''రేపు చెక్ మీద సంతకం చేసివ్వు. బ్యాంకు మా ఆఫీస్ దారిలోనే కదా. నేను శాలరీ తెస్తాను'' అన్న మహేష్‌ని గమనిస్తూ ''నాలుగేళ్ల వరకూ మీకా అవసరం రాదులెండి!'' నెమ్మదిగా అంది అపరాజిత.

''నాలుగేళ్లా! ఎందుకు? బ్యాంకుకి నువ్వే వెళ్లి తెస్తావా? నీ శాలరీ తేవడం నాకేం కష్టం కాదు'' అంటున్న భర్తను చూసి..

''చూడండి! నేను బ్యాంకులో పర్సనల్ లోన్ రెండు లక్షలు, కోపరేటివ్ సొసైటీలో డెబ్బై అయిదు వేలు, మరో ప్రైవేట్ బ్యాంకులో డెబ్బై అయిదు వేలు తీసుకుంటూ నేను బ్యాంకులకు చూపిన కారణం వరకట్నం కోసం. నేను చూపిన కారణానికి, ముందు సందేహించినా, తర్వాత ఆ లోన్స్ శాంక్షన్ అవ్వడం జరిగాయి. అందువల్లనే మీరడిగిన మూడున్నర లక్షల కట్నం సమయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సమకూర్చగలిగాం. ఇందులో నా తల్లిదండ్రుల ప్రమేయం ఏమీ లేదు. ఇది నా స్వంత నిర్ణయం. ఆ లోన్‌లన్నీ తీరడానికి నాలుగు సంవత్సరాలు పడుతుంది. నా తల్లిదండ్రుల కష్టార్జితంతో కాకుండా, నా శ్రమని గ్యారంటీగా చూపి మిమ్మల్ని నేను స్వంతం చేసుకున్నాను. జీరో ఫైనాన్స్‌లో వస్తువులు స్వంతం చేసుకొని అనుభవిస్తూ, ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టుకొనే తీరులోనే నేను మిమ్మల్ని స్వంతం చేసుకొన్నాను.

మీ అర్ధాంగిగా, నన్ను భరించాల్సింది మీరే! సామరస్యంతో సర్దుకుపోతారా, సఖ్యంగా ఉంటాం. కాదని విభేదించారో రాబోయే పరిణామాలు కూడా తీవ్రంగానే ఉంటాయి'' అని నిశ్చల స్వరంతో చెబుతున్న ఆమెను చూస్తూ... ఆమె మన వివాహ వ్యవస్థలోని లోపాన్ని ఎత్తి చూపుతూ...తనకు బుద్ధి చెబుతోందో లేక, బెదిరిస్తుందో అర్థంగాని అయోమయంలో ఏంతైనా 'అపరాజిత ఆధునిక యువతి' అనుకున్నాడు మహేష్!

**- దుట్టా శ్యామంతకమణి**
(విజయవాడ)